## క్లుప్తంగా

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానం



కిషన్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సంఘం సభ్యులు

మిర్యాలగూడ టౌన్‌: యాదగిరిగుట్టలో జూలై 4, 5, 6వ తేదీల్లో నిర్వహించే పారంపర్య వైద్య మహా సంఘం ప్రథమ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరుతూ సోమవారం ఆ సంఘం సభ్యులు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ ప్రథమ వార్షికోత్సవానికి తప్పక హాజరవుతానని కిషన్‌రెడ్డి చెప్పినట్లు ఆ సంఘం సభ్యులు తెలిపారు. కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వానించిన వారిలో పండిట్‌ శ్రీనివాస్‌ గురూజీ, యాత్రి మహర్షి, దుర్గారాణి తదితరులున్నారు.

### చిట్టీల వ్యాపారి ఇంటి ఎదుట ఆందోళన

మిర్యాలగూడ : చిట్టీల పేరుతో కోటిన్నరతో ఉడాయించిన వ్యక్తి ఇంటి ఎదుట బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో చిట్టీల వ్యాపారి ఇంటివద్ద ఆందోళనకు దిగిన బాధితులు మాట్లాడుతూ.. తాము అతడిని నమ్మి చిట్టీలు వేశామని మోసం చేసి రూ.కోటిన్నరతో పారిపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తాము కట్టిన చిట్టీ డబ్బులు చెల్లించాలని బాధితులు కోరారు.

### ధ్యానంతో ఒత్తిడి దూరం

మిర్యాలగూడ : నేటి ఆధునిక ప్రపంచంలో ఒత్తిడిని జయించేందుకు ధ్యానం చేయాల్సిన అవసరం ఉందని జ్ఞానదాత, ధ్యాన శిక్షకుడు తటవర్తి వీరరాఘవరావు అన్నారు. సోమవారం పంచభూత పిరమిడ్‌ ఆధ్వర్యంలో దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మారెడ్డి, నర్సిరెడ్డి, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

### అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు చేస్తున్న డిండి యువత చేయూత సభ్యులు

దేవరకొండ : డిండి మండల కేంద్రంలో కొన్ని నెలల నుంచి మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి స్థానికులు ఇచ్చిన ఆహార పదార్థాలు తింటూ జీవిస్తున్నాడు. సోమవారం సదర్‌ వ్యక్తికి కల్లు తిరిగి పడిపోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నాగర్‌ కర్నూల్‌ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆ వ్యక్తి మృతిచెందాడు. అతడికి సంబంధించిన వివరాలు తెలియకపోవడంతో డిండి యువత చేయూత ఆధ్వర్యంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో శైలేష్‌, ఏటి కృష్ణ, శ్రీనివాస్‌ గౌడ్‌, చంద్రయ్య గౌడ్‌, నరేష్‌, సురేష్‌, రషీద్‌, గోవర్ధన్‌ పాల్గొన్నారు.

### ప్రమాదవశాత్తు వ్యక్తికి గాయాలు

మాడుగులపల్లి : సిమెంట్‌ క్రషర్‌ మిల్లులో ప్రమాదవశాత్తు ఒక వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని కుక్కడం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెరుపల్లి గ్రామానికి చెందిన రెమడాల శ్రీను కుక్కడం గ్రామంలోని సిమెంట్‌ క్రషర్‌ మిల్లులో పనిచేస్తున్నాడు. రోజువారిగానే క్రషర్‌లో తన పనులు చేస్తున్న శ్రీను కుడి చేతికి ప్రమాదవశాత్తు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### రిమాండ్‌కు తరలింపు

మాడుగులపల్లి : సోదరుడి కుటుంబంపై దాడి చేసిన సంఘటనలో భార్యభర్తలను రిమాండ్‌కు తరలించిన సంఘటన మండలంలోని తోపుచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కేసాని చిన్న లక్ష్మయ్య, వెంకన్నలు ఇద్దరు అన్నదమ్ముళ్లు. వారి మధ్య భూవివాదం కొంతకాలంగా నడుస్తుంది. ఈనెల 3న జరిగిన ఘర్షణలో చిన్న లక్ష్మయ్య, అతడి భార్య పుష్పలు కేసాని వెంకన్న, సునీత, వారి కుమారుడైన మహేష్‌పై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం నిందితులైన చిన్న లక్ష్మయ్య, భార్య పుష్పలను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపించారు.

### సమ్మెను జయప్రదం చేయాలి

నాగార్జునసాగర్‌: జులై 9న దేశవ్యాప్తగా 11ట్రేడ్‌ యూనియన్లతో తల పెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ లక్ష్మీనారాయణ, జిల్లా నాయకుడు ఎస్‌.కె.బషీర్‌ కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ కమలానెహ్రూ ఏరియా ఆస్పత్రిలో డాక్టర్‌ చక్రవర్తికి సమ్మె నోటీసు అందజేశారు.

# హడావుడి చేశారు.. అమలు మరిచారు

- మున్సిపాలిటీల్లో నామమాత్రంగా వంద రోజుల ప్రణాళిక
- ఆర్భాటాలకే అధికారులు పరిమితం
- వార్డు ఆఫీసర్లు మాత్రమే వార్డుల్లో పర్యటన



బాపూజీ నగర్‌లో చెత్త తొలగించని పారిశుద్ధ్య సిబ్బంది

మిర్యాలగూడ టౌన్‌ : వర్షాకాలంలో పట్టణాలను పరిశుభ్రంగా ఉంచాలే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టింది. ఈనెల 2 నుచి సెప్టెంబర్‌ పదో తేదీ వరకు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే మిర్యాలగూడ మున్సిపాలిటీలో మాత్రం నామమాత్రంగా వంద రోజుల ప్రణాళిక అమలవుతోంది. కేవలం ఫోటోలు ఆర్భాటాలకే అధికారులు పరిమితమయ్యే అయ్యారణే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో సరైన సమయంలో పారిశుద్ధ్య పనులు జరగక ప్రజలు సీజనల్‌ వ్యాధుల భారిన పడే అవకాశముంది.

**కానరాని మున్సిపల్‌ అధికారులు**

ప్రణాళిక అమలులో భాగంగా పట్టణ ప్రణాళిక, మెప్మా సిబ్బంది, మున్సిపల్‌ అధికారులు కలిసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతూ తడి, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని వివరించాలి. పరిసరాల శుభ్రం, దోమల వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి. నాలాలు శుభ్రం చేయించి ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండా కుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలి. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగితే ప్లాట్ల యజమానుకు నోటీసులు జారీ చేసి శుభ్రం చేయించాలి. పచ్చదనం పెంచడానికి యువజన, సంఘాలు, మహిళా సంఘాల సభ్యులను భాగస్వామ్య చేయాలి. అయితే అధికారులు పై కార్యక్రమాలు సక్రమంగా నిర్వహిస్తున్నట్టు కనబడటం లేదు. ముఖ్యంగా అధికారులు చేపట్టిన కార్యక్రమాల్లో మాత్రం మున్సిపల్‌ అధికారులు ఎక్కడా కనిపించడం లేదు. కానీ కేవలం వార్డు ఆఫీర్లు మాత్రమే తమ పని తాను చేసుకుంటూ పోతుండడంతో మున్సిపాలిటీలో వంద రోజు కార్యక్రమం నీరుగారిపోతుంది.

**సిబ్బంది కొరతే కారణమా..**

మున్సిపాలిటీలో కొంత మేర ప్రక్షాళన జరిగినప్పటికీ సిబ్బంది కొరత మాత్రం కొట్టోచ్చినట్లుగా కనబడుతుంది. ఈ వంద రోజుల కార్యక్రమంలో ప్రధానంగా మున్సిపల్‌ కమిషనర్‌, టౌన్‌ ప్లానింగ్‌ అధికారి, ఇంజనీరింగ్‌ సెక్షన్‌ అధికారులు, రెవెన్యూ ఎక్కడ కూడా కనిపించకుండా కార్యాలయాలకే పరిమితం అవుతున్నారు. ఇదిలా ఉంటే మున్సిపాలిటీలో ఉన్న అధికారులు, ఔట్‌ సోర్సింగ్‌ అధికారులది ఎవరికి వారే యయునాతీరంగా మారింది. ఇంజనీరింగ్‌ విభాగంలో ఇద్దరు ఏఈలు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్కరు మాత్రమే కొనసాగుతుండగా మరో ఏఈగా హుజూర్‌నగర్‌కు చెందిన వ్యక్తికి మున్సిపాలిటీ ఇన్‌చార్జ్‌ ఏఈగా నియమించినప్పటికీ ఆయన ఎప్పుడు వస్తాడో.. ఎప్పుడు పోతాడో కూడా ఎవరికీ తెలియదు. ఎవరు ఏ పనులు చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అయితే విధి నిర్వహణలో ఒక్క వార్డు ఆఫీసర్లు మాత్రమే వార్డుల్లో పర్యటిస్తున్నారు. కానీ వారిని వివిధ సర్వేల పేరుతో వారికి వార్డుల్లో అవగాహన లేకుండా పోయింది.

**ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం**



మిర్యాలగూడ మున్సిపాలిటీలో వంద రోజుల కార్యక్రమంపై ప్రత్యేక దృష్టిని సారించాం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టుడుతున్న వంద రోజుల కార్యక్రమం ద్వారా ఈ నెల 2వ తేదీ నుంచి ప్రత్యేకంగా పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి డ్రెయినేజీన్ని శుభ్రం చేయించాం. కొన్ని వీధుల్లో మురుగునీటి కాల్వల పూడికతీత పనులు చేపట్టిన మాత్రం రోడ్లపై పడేసిన మట్టిని తొలగించే విధంగా చర్యలు తీసుకున్నాం. అదే విధంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమంపై కూడా ప్రత్యేక దృష్టిని సారించడంతో పాటు మురుగు కాలువలను కూడా శుభ్రం చేయించేసే విధంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం.

– మహ్మద్‌ యూసుఫ్‌, మున్సిపల్‌ కమిషనర్‌, మిర్యాలగూడ

## 'అంభ భవాని'తో సాగునీటి కష్టాలు తీరుతాయి

- కలెక్టర్‌ ఇలా త్రిపాఠి



అంభ భవాని లిఫ్టు ఇరిగేషన్‌ ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్‌ ఇలా త్రిపాఠి

దేవరకొండ : నేరెడుగొమ్ము మండలంలోని చిన్న మునిగల్‌ గ్రామంలో నిర్మాణంలో ఉన్న అంభ భవాని లిఫ్టు పూర్తయితే ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీరుతాయని కలెక్టర్‌ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం అంభ భవాని లిఫ్టు ఇరిగేషన్‌ పనులను పరిశీలించి పనుల పురోగతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందంపేట మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, అలాగే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్‌ అక్కడి నుంచి యాపలపాయతండాలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌ వెంట ఆర్డీఓ రమణారెడ్డి, తహసీల్దార్‌ ఉమాదేవి, ఇరిగేషన్‌ శాఖ ఎస్‌ఈడీ భద్రు, ఈఈ యలమందయ్య, డీఈ ప్రభాకర్‌, ఏఈ శివరాజ్‌, ఎస్‌ఐలు లోకేష్‌, కోటేష్‌, ప్రాజెక్టు మేనేజర్‌ రమేష్‌ ఉన్నారు.

**విద్యాసంస్థలు, హాస్టళ్లను తనిఖీ చేయాలి**

నల్లగొండ: మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని విద్యాసంస్థలు, అన్ని హాస్టళ్లను నిరంతరం తనిఖీ చేయాలని కలెక్టర్‌ ఇలా త్రిపాఠి ఆదేశించారు. నల్లగొండలోని కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో ఎక్కడా వాన, మురికి నీరు నిల్వ ఉండకుండా, ముళ్లపొదలు, చెత్తాచెదారం లేకుండా చూడాలన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో విష పురుగుల బెడద ఎక్కువగా ఉందని అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ–2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ జె.శ్రీనివాస్‌, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌ నారాయణ అమిత్‌, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

## లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలి

దేవరకొండ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో కార్మిక వర్గ పోరాటాలు ఆగవని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్‌ అన్నారు. సోమవారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన సీఐటీయూ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జూలై 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాగటి నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చినపాక లక్ష్మీనారాయణ, నల్ల వెంకటయ్య, ఒడపల్లి యాదగిరి, సర్దార్‌, రహీం, తదితరులున్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



హాలియా : లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

హాలియా : పేదల సొంతింటి కల నెరవర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అనుముల మండల కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హజారిగూడెం, మధారిగూడెం గ్రామాల్లో సాగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీఓ సుజాత వెంకట్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అదే విధంగా హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 3, 4,5,6,10,11 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌ అందజేశారు. ఈ కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌ రెడ్డి, కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్‌, మున్సిపల్‌ కమిషనర్‌ రామదుర్గారెడ్డి, పేరూర్‌ ఆలయ చైర్మన్‌ రిక్కల కొండారెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు ఆంజనేయులు, అన్నెపాక శ్రీనివాస్‌, ప్రసాద్‌నాయక్‌, తక్కెళ్ళపల్లి సైదులు, గౌనీ రాజారమేష్‌ యాదవ్‌, జూపల్లి శ్రీనివాస్‌, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

**ఇందిమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన**

నిడమనూరు : ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో ప్రతి ఒక్కరి సొంతింటి కల నెరవేరుతుందని మార్కెట్‌ చైర్మన్‌, కాంగ్రెస్‌ మండలపార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం అన్నారు. సోమవారం మండలంలోని ఊట్కూర్‌, గుంటిపల్లి, బొకమంతలపహాడ్‌, నందికొండవారిగూడెం, బంటువారిగూడెం, వద్దెరిగూడెం, గుంటిపల్లి, వేంపాడు, నారమ్మగూడెం, పార్వతీపురం, రాజన్నగూడెం గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఇంటి నిర్మాణ పనులకు అంకతి సత్యం, రాష్ట్ర యువజన కాంగ్రెస్‌ కార్యదర్శి ఎడవెల్లి వల్లభారెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆదేశాలతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ నర్సింగ్‌ కృష్ణయ్య, విజయ్‌కుమార్‌, జానయ్య, నాగయ్య, చెర్క శ్రీను, బాషిపాక సతీష్‌,అమరేందర్‌ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



మిర్యాలగూడ : దామరచర్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పీఎన్‌డీ ప్రసాద్‌



చింతపల్లిలో పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

దేవరకొండ : మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎస్పీ బిక్షపతి రావు అన్నారు. ఈ నెల 26న మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని సోమవారం చింతపల్లి మండల పరిధిలోని మాల్‌ వెంకటేశ్వర్‌ నగర్‌ కురుమేడు జెడ్పీహెచ్‌ఎస్‌లల్లో పోలీస్‌ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామ్మూర్తి, మండల విద్యాధికారి అంజయ్య తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి బుద్ధిగా చదువుకోవాలని రూరల్‌ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్‌ అన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ ఆదేశానుసారం సోమవారం దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల, బాలికల జూనియర్‌ కళాశాల విద్యార్థినులకు యాంటీ డ్రగ్స్‌పై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌ సిబ్బంది, విద్యార్థినులు ఉన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్‌): విద్యార్థులు పాఠశాల దశనుంచే మంచి అలవాట్లను అలవర్చుకుని డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్‌ఐ వీరశేఖర్‌ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మిషన్‌ పరివర్తన్‌ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం మొక్కను నాటారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మీవో శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు భాను, వెంకటేశ్వర్లు, నాగయ్య, వినయ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎస్‌ఐ వై.ప్రసాద్‌ అన్నారు. మిషన్‌ పరివర్తన్‌ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తరి రాములు, ఉపాధ్యాయులు రమాదేవి, కృష్ణయ్య, పీడీ శివరాం, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.

నిడమనూరు: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని నిడమనూరు ఎస్‌ఐ ఉప్పు సరేష్‌ సూచించారు. మండలంలోని నారమ్మగూడెంలో యువకులు, విద్యార్థులు, స్థానికులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, స్థానికులకు ఎస్‌ఐ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొండా శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు బైరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరకొండ : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు అన్నారు. సోమవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని దుగ్యాల మోడల్‌ స్కూల్‌లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్‌ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మిర్యాలగూడ రూరల్‌ సీఐ నాగ దుర్గ ప్రసాద్‌, రూరల్‌ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య అన్నారు. సోమవారం నాషా ముక్తి భారత్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా రూరల్‌ స్టేషన్‌లో సీఐ పీఎన్‌డీ ప్రసాద్‌, మిర్యాలగూడ మండలం అవంతిపురం గిరిజన గురుకుల పాఠశాలలో ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్యలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రూరల్‌ ఎఎస్‌ఐ రాములునాయక్‌, కానిస్టేబుళ్లు నాగరాజు, కిషన్‌, శంకర్‌, అరుణ, నిషా, పవిత్ర తదితరులున్నారు.

# గో ఆధారిత వ్యవసాయం శ్రేయస్కరం



రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న విజయ్‌రామ్‌

దేవరకొండ : గో ఆధారిత వ్యవసాయమే శ్రేయస్కరమని ప్రకృతి వ్యవసాయ విధాన సాధకులు, ప్రచారకులు విజయ్‌ రామ్‌ అన్నారు. సోమవారం చింతపల్లి మండల కేంద్రంలోని సాయి సన్నిధి దేవాలయంలో రైతులకు గో ఆధారిత వ్యవసాయ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నేలతల్లిని కాపాడి ప్రపంచానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించే దిశగా రైతులను ప్రోత్సహించే ఉద్దేశంతో రైతులకు అవగహన నిర్వహహిస్తున్నట్లు తెలిపారు. గో ఆధారిత వ్యవసాయంతో గ్రామాల్లో గోవుల సంఖ్య పెరుగుతుంది. అలాగే నాణ్యమైన విషతుల్యంగానే ఆహార ధాన్యాలు ప్రజలకు భవిష్యత్‌ తరాలకు అందించే అవకాశం ఉంటుందన్నారు. రసాయనాలు లేకుండా పండించిన పంటలను వినియోగించడం ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. జీవామృతం ఉపయోగించి నేలను సుసంపన్నం చేయాలన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం పూర్తిగా తగ్గించాలని సూచించారు. రైతులు పండించే పంటల్లో ఎలాంటి హానికరమైన రసాయనాలూ వాడకూడదన్నారు. డాక్టర్‌.జయచంద్ర మోహన్‌, యుగతులసి ఫౌండేషన్‌ చైర్మన్‌ శివకుమార్‌, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ఏఓ శ్రావణ కుమారి, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్‌ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

మిర్యాలగూడ : పట్టణంలోని ప్రైవేట్‌ పాఠశాలల అధిక ఫీజు దోపిడీని అరికట్టాలని డీఈఓ బొల్లారం భిక్షపతికి సోమవారం బీసీ విద్యార్థి సంఘం, బీసీ రాజ్యాధికార సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పగిడి జీడయ్యయాదవ్‌ మాట్లాడారు. ప్రైవేట్‌ పాఠశాల యాజమాన్యం విద్యాహక్కుల చట్టం నిబంధనలను పాటించడం లేదన్నారు. ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అయితగోని జనార్ధన్‌గౌడ్‌, కర్నాటి యాదగిరి, లక్ష్మణ్‌నాయక్‌, సైదులుగౌడ్‌, శ్రీనివాస్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్‌ : మిర్యాలగూడలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్‌ పాఠశాలలను నియంత్రించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎమ్మార్పీ భవనంలో మండల విద్యాశాధికారి బాలునాయక్‌కు వన్‌ టౌన్‌ బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ వన్‌ టౌన్‌ అధ్యక్ష, కార్యదర్శులు బంటు గిరి, కొంగరి వెంకటరమణ తదితరులున్నారు.

## శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీ ఆశయాలను సాధించాలి



దేవరకొండ : శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దేవరకొండ : భారతీయ జనసంఘ్‌ వ్యవస్థాపకుడు డాక్టర్‌ శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీని ప్రతీ బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్‌ కోరారు. సోమవారం దేవరకొండ పట్టణంలో శ్యామ్‌ ప్రసాద్‌ ముఖర్జీ బలిదాన్‌ దివస్‌ను ఆపార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్‌, నక్క వెంకటేష్‌, నేతాల్ల వెంకటేష్‌, గుండాల అంజయ్య, జల్దా భాస్కర్‌, గంప ఫణి, సహదేవుడు, నాగేంద్ర, ఛండీశ్వర్‌, హరి, శంకరయ్య, సుమన్‌, ప్రేమ్‌ పాల్గొన్నారు.

మాడుగులపల్లి : జనసంఘ్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ శ్యాంప్రసాద్‌ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మణ్‌ మాట్లాడుతూ శ్యాంప్రసాద్‌ ముఖర్జీ నడిపించిన బాటలో బీజేపీ పయనిస్తుందన్నారు. దేశం మొత్తాన్ని ఏకీకృతం చేసిన మహనీయుడని, జ్ఞానం, నిజాయితీతో పాటు గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి శ్యాంప్రసాద్‌ ముఖర్జీ అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్‌ సభ్యులు బొమ్మకంటి నరసింహ, సోషల్‌ మీడియా కన్వీనర్‌ దారమల్ల నాగరాజు, నాయకులు రాజవరపు గురుస్వామి పాల్గొన్నారు.

**శ్యాంప్రసాద్‌ ముఖర్జీకి నివాళి**

నాగార్జునసాగర్‌ : సాగర్‌లో డాక్టర్‌ శ్యాంప్రసాద్‌ దివస్‌ బలిదాన్‌ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంర్భంగా బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నందికొండ మున్సిపాలిటీ టౌన్‌ బీజేపీ అధ్యక్షుడు ఎర్రబోయిన రాజు, జిల్లా కౌన్సిలర్‌ జిటి రాజు, రమణయ్య, సుమ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పూజారిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

హాలియా : పట్టణంలోని ఎడమ కాల్వకట్ట సమీపంలోని శివాలయంలో పూజారిగా పని చేస్తున్న వినోద్‌ శర్మపై దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, బ్రాహ్మణ సంఘం నాయకులు సోమవారం హాలియా పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శివాలయం ధర్మకర్తగా చెప్పుకునే ఓ మహిళ శివాలయంలో పూజ చేస్తున్న పూజారి వినోద్‌శర్మపై దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ సతీష్‌రెడ్డిని కలిసి జరిగిన సంఘటన విషయాన్ని వివరించి ఎస్‌ఐ సాయి ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్‌, మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, దేవాలయ చైర్మన్‌ చెరుపల్లి ముత్యాలు, ఆలయ కమిటీ సభ్యులు పెద్ద సైదులు, తిరుపతయ్య, రమేష్‌, పుల్లయ్య, రాంరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌, మధుబాబు, బ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మోహన్‌శర్మ ప్రధాన కార్యదర్శి గిరిధరశర్మ, కోశాధికారి రమణ మూర్తి, గౌరవ అధ్యక్షుడు అబ్రపూడి రమణశర్మ, శ్రీరామాచార్యులు, ఫణిస్వామి తదితరులు ఉన్నారు.

## బాలికల చట్టాలపై అవగాహన ఉండాలి



మిర్యాలగూడ టౌన్‌: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీఓ మమత



కొండమల్లేపల్లి : పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్‌ : బాలికలకు అనేక చట్టాలు ఉన్నాయని, ఆ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మిర్యాలగూడ అర్బన్‌ సీడీపీఓ రేఖల మమత అన్నారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్‌, కళాశాలలో 'బాలికల చట్టాలు– సమస్యలు' అనే అంశంపై ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బాలికలకు ఏఏ హక్కులు ఉన్నాయో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21ఏళ్లు నిండిన తరువాతనే వివాహం చేసుకోవాలని, లేకుంటే అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ విభాగం లీగల్‌ ఆఫీసర్‌ ఎం, వెంకట సింహ, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల స్కూల్‌ అసిస్టెంట్‌ శ్రవంతి, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ కె.నాగమణి, హెల్త్‌ ఆఫీసర్‌ ప్రమీల, మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్‌ అరుణకుమారీ, స్టాప్‌నర్సు కోటేశ్వరి, ఏఎన్‌ఎం ఎం, శాంత, అంగన్‌వాడీ టీచర్లు నర్మద, సువర్ణ తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకొని ఆశయం దిశగా కష్టపడాలని కొండమల్లేపల్లి ఎంఈఓ నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం కొండమల్లేపల్లిలోని సోషల్‌ వెల్ఫేర్‌ బాలికల రెసిడెన్షియల్‌ పాఠశాలలో గర్ల్‌ చైల్డ్‌ ఎంపవర్‌మెంట్‌ ప్రోగ్రాంపై విద్యార్థినులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాలను అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ వరలక్ష్మీ వివరించారు. ఆపద సమయాల్లో చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌ 1098 పై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థినులకు గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌పై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ్‌, శ్రీదేవి, అనూష్‌, ఏఎన్‌ఎం, ఉపాధ్యాయులు అనురాధ, పద్మప్రియ, పాల్గొన్నారు.

## ఇబ్రహీంపేటలో ఎన్‌ఎస్పీ భూముల సర్వే

హాలియా : మండలంలోని ఇబ్రహీంపేట గ్రామ పరిధిలోని ఎన్‌ఎస్పీ భూములను డివిజన్‌ సర్వేయర్లు సోమవారం సర్వే చేపట్టారు. కలెక్టర్‌ ఇలా త్రిపాఠి అదేశాల మేరకు డివిజన్‌ సర్వేయర్‌ పోకల విజయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో సర్వేయర్ల బృందం తొలి రోజు పది సర్వే నంబర్లలో ఉన్న ఎన్‌ఎస్పీ భూములను మాత్రమే సర్వే చేసినట్లు విజయ్‌కుమార్‌ తెలిపారు. తొమ్మిది మంది సర్వేయర్ల బృందంతో గ్రామంలోని 159 సర్వే నంబర్లలో ఉన్న ఎన్‌ఎస్పీ భూముల సర్వే పూర్తయ్యాక కలెక్టర్‌కు నివేదికను సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

అడవిదేవులపల్లి : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సోమవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సామాజిక తనిఖీ నిర్వహించారు. 2024 ఏప్రిల్‌ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు ఆడిట్‌ నిర్వహించారు. సంవత్సరం కాలం మొత్తం డివియేషన్‌ రీకవరి సుమారు రూ.43,500 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రిసైడింగ్‌ అధికారి నవీన్‌, ఎంపీడీఓ రమేష్‌, ఎంపీఓ సూర్యనాయక్‌, టెక్నికల్‌ అసిస్టెంట్లు రాధ, వినోద్‌, పీల్డ్‌ అసిస్టెంట్లు మధు ఉన్నారు.

## రేషన్‌ బియ్యం పట్టివేత

మిర్యాలగూడ టౌన్‌ : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన సోమవారం మిర్యాలగూడ మండలంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్‌ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామానికి చెందిన షేక్‌ మౌలానా, అతడి భార్య షేక్‌ షాహినా ఇరువురు ఉప్పు, ముగ్గు అమ్ముతూ అదే సమయంలో లబ్ధిదారుల నుంచి సేకరించిన పీడీఎస్‌ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. అదే క్రమంలో నందిపాడు గ్రామ శివారులోని కేశవ దాబా హోటల్‌ వద్ద ఒక ఆటోలోకి ఐదు క్వింటాల పీడీఎస్‌ బియ్యాన్ని ఎక్కించుకొని ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు త్రిపురారం వైపు వెళ్తుండగా సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకొని సీజ్‌ చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాగుల పంపిణీ



టై, బెల్టులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రాములు

పెద్దవూర : మండలంలోని పిన్నవూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో టై, బెల్టులు, గుర్తింపుకార్డు, బ్యాగులను పాఠశాలకు సౌండ్‌ బాక్స్‌, స్పీకర్‌లను మండల విద్యాధికారి తరి రాములు సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న హెచ్‌ఎం జి.కృష్ణను అభినందించారు. ఈ కార్యక్రమంలో దాతలు గద్దల అశోక్‌, తేరా వెంకట్‌రెడ్డి, సందీప్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు.